క్లుప్తంగా

గజేంద్ర వాహనంపై దర్శనమిచ్చిన పాండురంగడు



కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు శుక్రవారం గజేంద్ర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు మహాగణపతి పూజ, పంచామృతాభిషేకం, శ్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి వాహన సేవల్లో చివరిదైన గజేంద్ర వాహనంపై కొలువుదీరి పూజలందుకున్నారు. అనంతరం ఆలయం నుంచి గాంధీసెంటర్ వరకు గ్రామోత్సవం కొనసాగింది.

నేడు పాండురంగడి రథోత్సవం

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజు పేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి రథోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 17న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా శుక్రవారం స్వామివారి వాహన సేవలు ముగిశాయి. తొమ్మిదవ రోజు స్వామివారి రథోత్సవం కనుల పండువలా సాగనుంది. ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు ఉదయం 11గంటలకు హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాల అనంతరం రంగరాజుపేట, సంతపేట, అమ్మవారిశాల, గాంధీసెంటర్ వరకు రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోహైల్‌బాబు సూచించారు. శుక్రవారం పట్టణంలోని సచివాలయం -2లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. డాక్టర్లు జగదీష్, రాజేష్, సోహైల్ బాబు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ పీఎస్ చంద్రశేఖర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ రాజవర్ధన్ రెడ్డి

బేతంచెర్ల: రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన కల్పించాలని డోన్ వ్యవసాయశాఖ ఏడీఏ అశోక్ రాజవర్ధన్ రెడ్డి సూచించారు. పట్టణంలోని మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఓ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అగ్రికల్చర్ అసిస్టెంట్స్, ఏంపీఈఓలతో ఖరీఫ్ పంటల ప్రణాళికపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల వారీగా ఖరీఫ్ పంటల ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. సబ్సిడీ విత్తనాలతో పాటు అవసరమైన ఎరువుల కోసం రైతులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తర్ణ అధికారులు మధు, మహమ్మద్ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు విశేష పూజలు



డోన్ : పట్టణంలోని పాతబస్టాండ్‌లో వెలసిన కనకదుర్గకు శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. వేకువజామున అమ్మవారికి అభిషేకం, మంగళహారతి, తీర్థప్రసాదాల వితరణ లాంటి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

15 మంది అరెస్ట్

కొలిమిగుండ్ల: పెట్నికోటలో ఎన్నికల రోజు పోలింగ్ బూత్ వద్ద జరిగిన గొడవలో 15 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను శుక్రవారం అరెస్ట్ చేశామని సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. బూత్ వద్ద టీడీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య గొడవ చోటు చేసుకోవడంతో పరస్పరం ఫిర్యాదు చేశారన్నారు. వీటిపై విచారణ చేసిన డీఎస్పీ 15 మందిని అరెస్ట్ చేసి కోవెలకుంట్ల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించడంతో కర్నూలు సబ్ జైలుకు తరలించామన్నారు. ఎన్నికల రోజు జరిగిన గొడవ కేసుల్లో ఇరువర్గాలకు చెందిన 62 మంది ముద్దాయుల్లో ఇప్పటి వరకు 36 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

పచ్చిరొట్ట సాగు.. పంటలు బాగు !

- సమగ్ర పోషక యాజమాన్యంలో పచ్చిరొట్ట ఎరువులు కీలకం
- 50 శాతం సబ్సిడీతో అందుబాటులో జీలుగ విత్తనాలు



వరినాట్లకు ముందు మడిలో జీలుగ సాగు చేసిన దృశ్యం

కోవెలకుంట్ల: ఖరీఫ్ సాగుకు రైతన్న సన్నద్ధం అవుతున్నాడు. ముందస్తు వర్షాలు కలిసి రావడంతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ఖరీఫ్ సీజన్ జూన్‌లో ప్రారంభం కానున్న నేపథ్యంలో వరి సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులు భూసారాన్ని పెంచడానికి ఉపయోగపడతాయని, వివిధ రకాల పంటల సాగులో సమగ్ర పోషక యాజమాన్యం ముఖ్యమైందని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. రసాయన ఎరువులను సిఫారసు మోతాదుకంటే అధికంగా వాడడం మూలంగా భూసారం కోల్పోయి క్రమేసి పంట దిగుబడులు తగ్గిపోతున్నాయన్నారు. దీనికి తోడు సేంద్రియ ఎరువుల వాడకం తగ్గిపోగా, పంట మార్పిడి చేపట్టకుండా ఒకే పంటను సాగు చేస్తుండటంతో పొలాల్లో పోషకాల అసమతుల్యత ఏర్పడుతోందన్నారు. పచ్చిరొట్ట ఎరువులు భూసారాన్ని పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని, వీటి వాడకంతో తక్కువ ఖర్చుతో అధిక పోషకాలను మొక్కకు అందించడంతోపాటు నేల భౌతిక లక్షణాలు మెరుగుపడుతుంది. నేల ఆరోగ్యం కాపాడుతాయన్నారు. కొన్ని రకాల పచ్చని మొక్కలను శాఖీయదశ చివరి భాగం వరకు(పూత దశకు వచ్చే ముందు) ఉంచి పొలంలో కలియదున్నితే భూమిలో సేంద్రియ పదార్థం, హ్యూమస్ పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత, వాడే విధానం, ప్రయోజనాలను తెలియజేశారు.

రెండు రకాల పచ్చిరొట్ట ఎరువులు

మొక్కను పూత దశకు ముందు వరకు పెంచి అదే పొలంలో కలియదున్నే విధానంలో ఎక్కువగా లెగ్యూమ్ జాతి మొక్కలను వేయాలి. ఒక మోస్తరు నుంచి అధిక వర్షపాతం ప్రాంతాల్లో, లోతైన భూముల్లో ఈ విధానం అవలంభిస్తారు. వీటిని భూమిలోదున్నే సమయానికి సరైన మోతాదులో వర్షపాతం, నీటి వసతి ఉన్నట్లు అయితే ఈ పచ్చిరొట్ట ఎరువులు బాగా కుళ్లిపోయి భూమిలో కలిసిపోతాయి. తగిన తేమశాతం నేలలో లేనప్పుడు ఇవి పాక్షికంగా మాత్రమే కుళ్లడంతో చెదలు వంటివి వచ్చే అవకాశం ఉంది. జీలుగ, జనుము, అలసంద, మినుము వంటివి ఈ విధానానికి అనువైన రకాలు. పచ్చిరొట్ట మొక్కల ఆకులు, లేత కొమ్మలను సేకరించి వేరే పొలంలో వేసి దున్నే విధానంలో కానుగ, గ్లెరిసీడియం కాషియా వంటివి రకాలు అనువైనవి. పొలం గట్లమీద ఉండే చెట్ల నుంచి కాని, అడవి ప్రాంతంలో పెరిగే పచ్చిరొట్ట చెట్ల నుంచి కాని ఆకులను, లేత కొమ్మలను సేకరించి పొలంలో కలిపి దున్నడం వలన ఆకులు బాగా కుళ్లి పొలానికి సత్తువ వస్తుంది.

పచ్చిరొట్ట ఎరువులు వాడే విధానం

ప్రతి పచ్చిరొట్ట ఎరువు పంటను శాఖీయ దశ (పూత దశకు ముందు) చివరన కోసి అలాగే అక్కడిక్కడే వేసి అదే పొలంలో దున్నాలి. ఈ విధంగా దున్నేటప్పుడు పొలంలో తగినంత నీరు పెట్టాలి. వారం లేదా పది రోజుల వ్యవధితో మరోకసారి దున్ని నీటి తడులివ్వాలి. ఈ విధంగా చేయడం వలన 20 నుంచి 30 రోజుల్లో చెట్లన్నీ కుళ్లిపోయి తర్వాత వేసే ప్రధాన పంటకు పోషకాలను అందిస్తాయి.

పచ్చిరొట్ట ఎరువుల ప్రయోజనాలు

పచ్చిరొట్ట ఎరువులు పొలంలో కలియదున్నడం వలన భాగా చితికి సేంద్రియ పదార్థంగా మారుతుంది. ఈ సేంద్రియ పదార్థం వలన నేల భౌతిక లక్షణాల్లో మార్పు జరిగి నేల బాగా గుల్లబారి మొక్కల వేళ్ల పెరిగి, వేరు వ్యవస్థ ధృడపడుతుంది. గాలి, నీరు సులభంగా గ్రహించడానికి వీలవుతుంది. పచ్చిరొట్ట ఎరువుల తర్వాత వేసే ప్రధాన పంటకు అందించే రసాయన ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. నేలలో ఉండే లాభదాయక సూక్ష్మజీవులకు (బాక్టీరియా, శిలీంద్రాలు) సేంద్రియ పదార్థం ఆహారం అవుతుంది. సేంద్రియ పదార్థం ఎక్కువగుడం వలన లాభదాయక సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుంది. తద్వారా వివిధ జీవ రసాయన చర్యలు వేగవంతంగా జరుగుతాయి. రసాయన ఎరువుల మోతాదును కొంత వరకు తగ్గించవచ్చు. మొక్కకు స్థూల పోషకాలతోపాటు సూక్ష్మ పోషకాల లభ్యత పెరుగుతుంది. చౌడు భూముల్లో జీలుగను వేయడం వలన పంట పెరుగుదలపై చౌడు ప్రభావం చాలా వరకు తగ్గించవచ్చు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌ను పురస్కరించుకుని ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో జీలుగ, పిల్లిపెసర విత్తనాలను సరఫరా చేస్తోంది.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి



మహిళతో మాట్లాడుతున్న కమిషనర్ జయరాం

డోన్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణ పరిధిలోని 28వ వార్డు కాలనీల్లో శుక్రవారం డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషాతో కలిసి కమిషనర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీల మహిళలతో మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. నీటి నిల్వల మూలంగా డెంగీ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలు శిక్ష

కోవెలకుంట్ల: మద్యం తాగి లారీ నడుపుతూ పట్టుబడిన డ్రైవర్‌కు శుక్రవారం జైలు శిక్ష పడింది. ఎస్‌ఐ వరప్రసాద్ అందించిన సమాచారం మేరకు.. పట్టణ శివారులో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ నిర్వహిస్తుండగా బాపట్లకు చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి లారీ నడుపుతూ పట్టుబడ్డాడు. డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసిన పోలీసులు డ్రైవర్‌ను కోవెలకుంట్ల కోర్టులో హాజరు పరుచగా నెల రోజులపాటు జైలు శిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



శిక్షణ తీసుకున్న ఏహెచ్‌ఏలతో ఉన్నతాధికారులు

డోన్ : ఏహెచ్‌ఏలు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, మూగజీవాల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలువాలని నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గోవిందునాయక్ సూచించారు. స్థానిక పశువైద్యశాఖ కార్యాలయం ఆవరణలోని గొర్రెల పెంపక శిక్షణ కేంద్రంలో శుక్రవారం డివిజన్ స్థాయి ఏహెచ్‌ఏలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌ఏలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పశువులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా యజమానులకు ముందస్తు సూచనలు చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు హెచ్‌ఎస్, బిక్యూ, ఈటీ టీకాలను వేయించేలా పశుపోషకులను చైతన్యపరచాలని, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచిచారు. గొర్రెల్లో సంభవించే వ్యాధుల్లో బొనెటిక్ వ్యాధి నివారణకు మేలైన పశుగ్రాసం గురించి పెంపకందారులకు వివరించాలన్నారు. పశుపోషణ, గొర్రె పిల్లల సంరక్షణ గురించి డీడీ వెంకటరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన డోన్‌కు చెందిన వరలక్ష్మి, కళ్యాణి, బేతంచెర్లకు చెందిన శాంతి ప్రియకు అధికారులు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో డీడీఏ డాక్టర్ నాగరాజు, డోన్ ప్రాంతీయ పశువైద్యశాలకు చెందిన డాక్టర్లు శ్రీనివాసరెడ్డి, రామసుబ్బారెడ్డి, క్రిష్ణకుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్‌షఫీ

డోన్ రూరల్ : అధిక దిగుబడులు వచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫీ తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని గ్రామస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఏఓ మాట్లాడారు. వేరుశనగ కే-6ను దాదాపు 12సంవత్సరాలుగా సాగు చేస్తూ వాతావరణ పరిస్థితులు అనుకూలించనందున నష్ట పోతున్నారన్నారు. శాస్త్రవేత్తల సలహాల మేరకు ఉన్నతాధికారులు వేరుశనగా కొత్తరకాలైన కదిరి లేపాక్షి (కే-1812), టీసీజీఎస్-1694 వంటివి 40శాతం రాయితీతో అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ రకాలు మెట్ట పరిస్థితులను తట్టుకోవడంతోపాటు, దోమ, మచ్చ తెగులును కూడా తట్టుకుంటుందని వివరించారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రమీల, గ్రామస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



మృతుని తండ్రికి చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ ఖాశీం

డోన్ : బ్యాంకు ఖాతా కలిగిన ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ సౌకర్యం కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఖాశీం సూచించారు. మండలంలోని చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన ఖాతాదారుడు రేగటి వెంకట కృష్ణారెడ్డి గతేడాడి డిసెంబర్‌లో విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఇతను పంట రుణంతో పాటు కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పొందిఉండడంతో మృతుని తండ్రి రేగటి మున్సిరెడ్డికి రూ.5లక్షల చెక్కును శుక్రవారం బ్యాంకు ఆవరణలో ఆయన అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ సిబ్బంది మయూర్, కేర్ ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు వెంకటకృష్ణ, రాజారావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుండగుల దుశ్చర్య.. దెబ్బతిన్న ఉల్లినారు



మాడుపోయిన ఉల్లి నారు

బేతంచెర్ల: గుర్తు తెలియని దుండగుల దుశ్చర్యతో ఓ రైతు తీవ్రంగా నష్టపోయారు. మండల పరిధిలోని కొమ్మూరి కొట్టాల గ్రామానికి చెందిన రైతు కొట్టాల తిమ్మయ్య నాలుగు ఎకరాల్లో ఉల్లి సాగుకు 40 రోజుల క్రితం ఉల్లి నారు పోశాడు. శనివారం నాటు వేయడానికి పొలం సిద్ధం చేసుకోగా శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఉల్లినారుపై గడ్డి మందు స్ప్రే చేశారు. దీంతో ఉల్లి నారు పూర్తిగా దెబ్బతింది. దాదాపు రూ.50 వేల మేర నష్టం జరిగినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

డోన్ టౌన్: పదవ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏ,బీ రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 'ఏ' కేంద్రంలో 88 మంది విద్యార్థులకుగాను 39 మంది విద్యార్థులు హాజరవ్వగా 'బీ' కేంద్రంలో 100 మందికి 48 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షా కేంద్రాల సూపర్‌వైజర్ వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే ఇంటర్ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 70 మందికి గాను 66 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు.

బనగానపల్లె రూరల్ : పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు, ఉర్దూ పరీక్షలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 127 మంది విద్యార్థులకుగాను 50 మంది, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 127 మందికి 47 మంది పరీక్షకు హాజరైనట్లు పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లు రామక్రిష్ణయ్య, బాలగంగధర్‌రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల డిపార్ట్‌మెంట్ అధికారులుగా కుమార్ బాబు, యాగంటప్ప వ్యవహరించారు. ఎంఈఓ స్వరూప పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు మొత్తం 51 మంది విద్యార్థులు హాజరు కావాల్సివుండగా ఇద్దరు, అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకుగాను మొత్తం 19 మంది విద్యార్థులు హాజరుకావాల్సి వుండగా ఒక్కరూ గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ ఆఫీసర్ సాలెహాబేగం తెలిపారు.

కొలిమిగుండ్ల: పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మోడల్ స్కూల్‌లో పదో తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. 285 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఉదయం ఇంటర్ ఫస్టియర్, మధ్యాహ్నం నుంచి సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు ఏర్పాటు చేశారు. మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలల ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

నేడు డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్ : ఆర్టీసీలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజల సూచనలు సలహాలు స్వీకరించేందుకు శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రజలు, ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు, ఫిర్యాదులు సెల్ నంబరు 9959225795 తెలియజేయాలని సూచించారు.

కౌలు భూముల బహిరంగ వేలం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయానికి సంబంధించిన భూముల కౌలుకు సంబంధించి శుక్రవారం ఆలయ పర్యవేక్షణాధికారి హరిచ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 23.47 ఎకరాలు వేలం నిర్వహించగా ఆలయానికి రూ.1.41లక్షల ఆదాయం వచ్చిందని అసిస్టెంట్ కమిషన్ కామేశ్వరమ్మ తెలిపారు. గతేడాది కంటే రూ.13,500 కౌలు పెరింగిందన్నారు.

ఓఆర్‌ఎస్ ద్రావణం పంపిణీ

డోన్ టౌన్ : పట్టణంలోని పాత బస్టాండ్‌లో శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కొచ్చెర్వు వెంకటేశ్వర్లు, మమ్మద్ రఫీల ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని పంపిణీ చేశారు. వేసవిలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరిస్తూ ముద్రించిన కర పత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున ఆచారి,రవి తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికి నీటి సరఫరా ప్రారంభం

బేతంచెర్ల: పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ వద్ద ఇన్‌టెక్ వెల్ వద్ద సాంకేతిక మరమ్మత్తు పనుల కారణంగా బేతంచెర్ల పట్టణానికి వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు పూర్తి కావడంతో శుక్రవారం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరాను ప్రారంభించారు. నీటిని కాచి వడకట్టుకొని తాగాలని పట్టణ ప్రజలకు కమిషనర్ రమేష్ బాబు సూచించారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



బనగానపల్లె : మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ శుక్రవారం ఘనంగా జరిగింది. అసిస్టెంట్ కమీషనర్ కామేశ్వరమ్మ, అర్చకులు ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం సంప్రదాయ బద్ధంగా అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



బనగానపల్లె పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ రఘువీర్, సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ అనంతరం ప్రజల శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రఘువీర్ హెచ్చరించారు. బనగానపల్లె పట్టణ ప్రధాన రోడ్లలో శుక్రవారం సాయంత్రం కేంద్ర ఆర్మీ బలగాలతో కలిసి సీఐ గంటా సుబ్బారావు, డీఎస్పీ రఘువీర్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉంటుందని, విజయోత్సవ ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో వ్యవహరించాలని, పోలీసుల నిబంధనలు పాటించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు 30 యాక్ట్ అమల్లో ఉందని, ఆ రోజు ఎవరు బయటకు రాకుడదన్నారు. ఇతరులను రెచ్చగొట్టేలా ప్రవర్తించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెద్దపాదిళ్లలో నాకాబందీ

ప్యాపిలి: మండల పరిధిలోని పెద్దపాదిళ్ల గ్రామంలో శుక్రవారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఎస్‌ఐ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సమయంలో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. గెలిచిన పార్టీలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేధం అన్నారు. అలాగే బాణసంచా కాల్చడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా తిరుకల్యాణ మహోత్సవాలు



గరుడవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న చెన్నకేశవస్వామివారు

అవుకు: మండల కేంద్రం అవుకులో తిరుకళ్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామివారు గరుడవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు, పండితులు స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై అందంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఆలయంలోని మండపంలో ఉంచారు. రాత్రి స్వామి అమ్మవార్లను కోటవీధి, తేరువీధి, రాజావీధుల గుండా మండపం వీధికి, అటు నుంచి తిరిగి ఆలయానికి పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. దారి పొడువునా భక్తులు స్వామి అమ్మవార్లకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. గరుడ సేవలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శనివారం గజ వాహనంపై ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఉంటుందని రైతు సంఘం పెద్దలు తెలిపారు.



వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

బేతంచెర్ల : మండల పరిధిలోని యంబాయిలో వెలసిన చెన్న కేశవస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంపై స్వామి, అమ్మవార్లను కొలువుంచి ఊరేగింపు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ జయరామ్

డోన్ టౌన్ : పట్టణంలోని వైఎస్ నగర్‌లో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణం, వెంకటాపురం రోడ్డులోని పేరంటాలమ్మ గుడి వద్ద చేపట్టిన 11.20 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను శుక్రవారం డీఈ రసూల్, ఏఈలు సురేష్, హితేష్‌లతో కలిసి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ పరిశీలించారు. ట్యాంక్ నిర్మాణం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో నీటి శుద్ధిపై వివరాలు సేకరించారు. నీటి వాడకం, నిల్వ తదితర విషయాలపై సిబ్బందితో చర్చించారు.